# పూలదండ

పువ్వులు... పువ్వులు...
పువ్వులు!!

రక, రకాల పువ్వులు— రంగు, రంగుల పువ్వులు!!

చిరునవ్వులు చిందించే అందమైన పువ్వులు!!

మల్లెలు... త్రిల్లియలు.. గులాబీలు... కనకాంబరాలు... వాటికి తోడు దవనం... ఇవన్నీ ఏర్చి - కూర్చి—పేర్చిన సుందరమైన, చాలా అరుదైన, మరెంతో పెద్దదైన పూలదండ!!

అంత పెద్ద పూలదండను, అత్యంత ప్రేమతో, గౌరవనీయులైన, పూజ్యనీయులైన, దీనబంధు, దీన జనోద్ధారక, దేశోద్ధారక బిరుదాంకితులైన, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులైన శ్రీ శ్రీ శ్రీ వినాయకరావు గారి మెడలో అలంకరించబోతోంది.

ఎంతో జాగ్రత్తగా, మరెంతో సున్నితంగా, ఇంకేదో పెద్ద ఘనకార్యంలా ఓ నలుగురు వ్యక్తులు దానిని చిరునవ్వులతో మోస్తూ, వేదికనలంకరించిన శ్రీ వినాయకరావు గారి గళంలో వేయడానికి వెళుతున్నారు.

ఆ నలుగురు ఎవరన్నది వర్ణించడం అంత ముఖ్యమైన విషయం గాదేమో?? ఎందుకంటే బెల్లంచుట్టూ ఈగలు ఎప్పుడూ ముసురుతుంటాయన్నది జగమెరిగిన నిత్యసత్యం. నగ్నసత్యం. ఇంకా చెప్పాలంటే మంత్రిగారి భజన సంఘం. కాకారాయుళ్ళు. బాకారాయుళ్ళు. ఏ మంత్రిగారి మీటింగయినా వారలా ప్రత్యక్షం అవుతూనే ఉంటారు. పదవిలో ఉన్నంత కాలం వారికిది అత్యంత సామాన్యమయిన దినచర్య.

ఆ భారీ పూలదండను చూచిన శ్రీ శ్రీ శ్రీ వినాయకరావు గారి ముఖారవిందం ఆనందోత్సాహంతో వెలిగిపోతోంది. ఇంతసేపూ ఆ పూలదండ కోసమే ఎదురు చూస్తున్నట్లుగా, వినాయకరావు గారి ముఖంలో ఓ వైపు చిరునవ్వు పెదవులపై లాస్యం చేస్తోంది. మరోవైపు అవ్యక్తమైన భావాల రంగు, రంగుల నీడలు ముఖంలో ప్రతిఫలిస్తున్నాయి ఆ పూలదండలోని రంగు, రంగుల పువ్వుల్లాగా!!

దట్టమైన, నల్లని మబ్బులు ఆకాశాన్నికమ్మేసినట్లు విశాలమైన ఆ మునిసిపల్ ఓపెన్ గ్రౌండు ఆహూతులయిన అనంతజన సందోహం కప్పేసింది. ఆ ప్రజావాహిని కళ్ళకు మంత్రిగారి ముఖంలో గోచరించే చిరునవ్వు తప్ప, రంగు, రంగుల నీడలు కనిపించటం లేదెందుకనో??

ఆఖరుకు ఎలాగైతేనేం, శవ వాహకుల్లాగా ఆ నలుగురూ, ఆ పూలదండ కాయాన్ని మోసుకొచ్చి, మంత్రిగారి మెడలో, అత్యంత వినయ విధేయతలతో అలంకరించారు.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. మంత్రిగారి మెడ కొద్దిగా వంగింది. ఆ వంగటం పూలదండ బరువుకే వంగిందో?? లేక ప్రజాభిమానం వల్ల వంగిందో చెప్పటం కష్టం.

మంత్రిగారు ఆవేశంగా లేచారు. మైకు వద్దకు నడిచారు. గొంతు సవరించుకున్నారు.

"నాకు అత్యంత ప్రీతి పాత్రులైన నా ప్రజలారా!"

సభలో హర్షధ్వానాలు!

"ఈ రోజు ఆగస్టు పదిహేను. సుదినం. పవిత్రమైన రోజు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, సాధించి, స్వేచ్ఛను సంపాదించిన స్వతంత్ర దినం. పూజ్యబాపూజీని ఏ యమ్మ కన్నదో, జాతినేత నెహ్రూజీని ఏ యమ్మ కన్నదో, ఆ యమ్మలకు, ఆ యమ్మలగన్న యమ్మలకు నా హృదయపూర్వక వినయాంజలిని ఘటిస్తున్నాను!!"

సభలో చప్పట్లు మారు మోగాయి!

"మనది పవిత్ర భారతదేశం! కళలకు కాణాచి!! అంగడి వీధుల్లో నవరత్నాలమ్మిన రత్నగర్భ! క్షామం తెలియని అన్నపూర్ణ!! వేదాలు పుట్టింది బట్టలు నేసింది గణితం పుట్టింది ఈ దేశంలోనే!! వ్యాసుడు వాల్మీకి కాళిదాసు నన్నయలు పుట్టింది ఈ దేశంలోనే!! భారత, భాగవత, రామాయణాలు వెలసింది ఈ దేశంలోనే!! అటువంటి దేశంలో పుట్టిన మనం పునీతులం. పవిత్రులం. "జననీ జన్మ భూమిశ్చ, స్వర్గాదపి గరీయసీ" అని ఆర్యోక్తి. అది ఒక్క ఆర్యోక్తి మాత్రమే గాదు భారతదేశ ప్రగతికి, అభ్యుదయానికి పునాది రాయిలాంటి దివ్యమైన ఔషధం అగణనీయమైన ఒక మూల సూత్రం. దానిని మనం మరువలేనిది మరువకూడనిది!!"

సభలో జయ, జయ ధ్వానాలు!!

"సీత, సావిత్రి, అరుంధతి, అనసూయ మొదలైన పతివ్రతలు, రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి వంటి వీరవనితలు, కస్తూరిబా, సరోజినీ నాయుడు, అనీబిసెంటు వంటి ఆదర్శ నారీమణులకు ఆలవాలమైన పవిత్ర భారతదేశం మనది!!"

సభలో ఆనందకోలాహలం!!

"అటువంటి పవిత్ర భారతదేశం నేడు ఎలా ఉంది? ఏమై పోతోంది?? ఎటువైపు పయనిస్తోంది? ప్రగతి బాటవైపా! ప్రళయ ఝంఝువైపా?? ఏనాడు ఆడది ఒంటరిగా అర్ధరాత్రి సైతం ఇంటికి క్షేమంగా చేరగలుగుతుందో, ఆనాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని 'జాతిపిత మహాత్మాగాంధీ'— అన్నారు.

సభలో మంత్రిగారికి జేజేలు!! "హిప్ హిప్ హుర్రే!! హిప్ హిప్ హుర్రే!! జిందాబాద్! జిందాబాద్! వినాయకరావ్ జిందాబాద్!!" ప్రేక్షకుల గొంతులు లయబద్ధంగా ఆ గ్రౌండులో ప్రతిధ్వనించాయి.

ఫక్కున నవ్వింది పూలదండ. ఉలిక్కిపడ్డాడు వినాయకరావు. మాటలు తడబడ సాగాయి. మెడలోని పూలదండ అంతకంతకూ బరువౌతోంది.

* * * * * * * * * * *

"మంత్రిగోరిల్లు ఇదేనాండి??" అడిగిందో పదహారేళ్ళ జవ్వని. పేరు మల్లిక.

"ఎవరు కావాల్న?" గూర్ఖా గొంతు ప్రశ్నించింది.

"అదే బాబూ! మంత్రిగోరు. పెనల్ పూల్దండ ఆర్డరిచ్చినారు. నిన్నటేల నుండి గంజినీళ్ళు కూడా ముట్టుకోకుండా, అదే పనిగా కూకోని, దండ కట్టి ఒట్టుకొత్తన్నాను. శానా పెద్ద దండగందా!! అరిజెంటుగా సేసి ఒట్టుకురమ్మని, మా అయ్యతో సెప్పినారంట. మరేమో మా అయ్యకు నిన్నటేల నుంచి ఒకటే జొరం. మూసిన కన్ను తెరకుండా, అలా మంచం మీద పడున్నాడు. మంత్రిగోరు ఆర్డరిచ్చినాక, కట్టప్పోతే ఎలా?? దండలు కట్టడంలో ఈ జిల్లాలో మా అయ్యకున్నంత పేరు ఒరికీ నేదు తెలుసా!! సరినే! ఆర్డరిచ్చినాక తప్పద్దా అని, ఓ రెండు రోజులు గంజినీళ్ళకు తెల్లారుద్దిలేదని "అయ్యా! అయ్యా!! నాను సేసి ఒట్టుకెడతాలేన్నాను. మా అయ్య సరేనన్నడు. ఆఖరికి కట్టబడి పూల్దండ కట్టినా!!"

"ఓహో! పూలమ్మివా నువ్వు. మంత్రిగారు లోపలున్నారు వెళ్ళు!!" గేటు తీసి, దారి చూపించాడు గూర్ఖా. నెత్తిమీదున్న గంపను వంకకెత్తుకుని చకచకా లోనికి నడిచింది మల్లిక.

అది మంత్రిగారు ప్రత్యేకంగా రెస్టు తీసుకోవడానికి ప్రత్యేకంగా కట్టించుకున్న బంగళా!! బంగళా చుట్టూ చక్కటి తోట బంగళా అందానికి జీవం పోస్తోంది. నియాన్ లైట్ల వెలుగులో బంగళా దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది.

విశాలమైన హాలు. ఖరీదైన ఫర్నీచరు. రకరకాల డిజైన్లున్న కార్పెట్లు, రంగురంగుల విద్యుద్దీపాలు. గోడలకు ప్రకృతి దృశ్యాలను రమణీయంగా చిత్రింపబడిన తైలవర్ణ చిత్రాలు. మహారాజుల భోగం ఎలా ఉంటుందో తెలీని ఆ అమాయక పడుచు ప్రాణి వింతగా చూస్తోంది వాటిని.

"ఓలమ్మో! ఇదిల్లే! రావణాసురిడిలంక నాగుంది. మా అయ్య సెబుతుండే వాడు, మంతిరి గోరిల్లు లంక నాగుంటాదని, ఏటో అనుకున్నాను. ఇదన్న మాట!!"

మాజేటి సుదర్శనరావు

చెంపకు చెయ్యి చేర్చి నోరు తెరిచింది మల్లిక.

చీమ చిటుక్కుమన్నా, వినబడేంత నిశ్శబ్దంగా ఉంది బంగళా. ఆ నిశ్శబ్దం ఆమెకు భయాన్ని కలిగించింది. "ఈ నంకంత కొంపలో ఓరులేరేటి?? మంత్రిగోరి పెళ్ళాం, బిడ్డలు, సుట్టాలు-పక్కాలు, సావాసగాల్లు, ఈల్లతోనే కాలచ్చేపంగందా మంత్రి గోరికి! మరాలెవరూ కనబడరేటి?? ఇంతక్నా మా ఇల్లే నయం. కలకలలాడుతుంటది మా గుడిసె. ఇదేటి బొత్తిగా సొశానం లాగుండాది. ఇంత కొంపలో మంత్రిగారెక్కరుంటారబ్బా! ఆరి పెల్లాం, పిల్లలుఓరు అవుపడరేటి?? ఇపుడెట్టా వచ్చేదబ్బా! నానుపిలాల్నా? వద్దా?? ఓలమ్మో! పిలిత్తే ఏటన్నా అనుకుంటరేమో! అయినా ఏవని పిలాలి? ఓర్ని పిలాలి? సర్నే. మా అయ్య పూల్దండ మంత్రిగారికే ఇమ్మన్నాడు. ఆర్నే పిలుత్తాను ఏటయితే అదే అవుద్ది??"

"బాబుగోరూ! బాబుగోరూ!" నెమ్మదిగా పిలిచింది మల్లిక.

"ఓరూ! పలకరేటబ్బా! పోనీ అమ్మగోర్ని పిలుత్తాను. అమ్మగోరూ! అమ్మగోరూ!!" కొంచెం గట్టిగా పిలిచింది. సమాధానం లేదు.

"ఆరు మేడమీదున్నారో? ఏటో??" మల్లిక మేడ మెట్ల వైపు దారి తీసింది. మేడ మీద అసంఖ్యాకమయిన గదులు దర్శనమిచ్చాయి.



"ఓలమ్మో! ఇన్ని గదులే? జనం ఓరు లేరు గందా! ఇన్ని గదులు ఏం చేసుకుంటారబ్బా!! పేద్ద ఓటేలు లాగుంది. మా అయ్యసెప్పే కాసీమజిలీకతల్లో లాగా ఇంద్రభవనం నాగుంది. ఇన్ని గదుల్లో మంత్రి గోరు ఏడుంటారబ్బా!!" "అయ్యగోరూ! అయ్యగోరూ!!" అంటూ మల్లిక ఒక్కొక్క గది తలుపు నెడుతూ, తొంగిమూస్తోంది. గదులన్నీ చిమ్మ చీకటిగా ఉన్నాయి. అంతా నిర్మానుష్యం. ఎక్కడా పిట్ట జాడ గూడా లేదు. హాలులో గోడ గడియారం ఠంగుఠంగుమంటూ తొమ్మిది గంటలు కొట్టింది. ఉలిక్కిపడ్డ మల్లిక ఒక్కొక్క గంటను లెక్క పెట్టుకుంటూ, "ఓలమ్మో! తొమ్మిదయిపోనాది. మా అయ్య నా కోసం ఎదురుసూత్తా ఉంటాడు. బాగా సీకటి పడిపోనాదని, నే తొందరగా ఎల్లకపోతే మా అయ్య బెగ్గిటెల్లిపోతడు. అసలే ఆడికి జొరం. ఇంతకీ మంత్రిగోరు ఏ గదిలోనూ అవుపడరేటి?? ఆ! ఆ సివారి గదిలో దీపం ఎలుగుతుండాది. ఒకేళ అందులో గాని ఉండారేమో??" అనుకుంటూ ఆ చివరి గది దగ్గరకు వచ్చి నిలబడింది. తలుపులు జారవేసి ఉన్నాయి. తలుపు సందుల్లోంచి ట్యూబులైట్ కాంతి బైటకు తొంగిమూస్తోంది. మల్లిక తలుపు సందుల్లోంచి ఒంటి కంటితో చూసింది.

లోపల డబుల్ కాట్ బెడ్, మెత్తటి దిళ్ళు, మంచం ప్రక్కగా ఓ పెద్ద మేజా, మేజా మీద రంగు రంగుల ద్రవాలు నిండిన సీసాలు, రకరకాల గ్లాసులు, ఆ ప్రక్కనే ఉన్న చిన్న టీపాయ్ మీద సిగరెట్టు ప్యాకెట్లు, యాష్ ట్రే, సిజర్ లైటరు, గదిలో ఓ మూలగా పెద్ద నిలువుటద్దం, డ్రెస్సింగు టేబులు, మరో ప్రక్క ఇనుపబీరువా, గదికి అనుకుని ఎటాచెడ్ బాత్‌రూమ్ ఉన్నాయి. గది గోడలకు అలంకారాలుగా వివిధ భంగిమలు చిత్రించబడిన నగ్న చిత్రపటాలు ఉన్నాయి. మంత్రిగారు
మంచం మీద పడుకుని, అసహనంగా అటు, ఇటు దొర్లుతున్నారు. "ఛీ, ఛీ ఏటీ బొమ్మలు? అసయ్యంగా ఉన్నాయి. గొప్పోరిళ్ళలో ఇట్టాగే ఉంటాయి గావాల్ను. అయ్యేంటబ్బా! ఆ బల్ల మీద అన్నోడి సీసాలున్నాయి. పాపం! మంత్రిగోరికి గుండె జబ్బేమో? ఎన్ని మందులు మింగుతున్నారో? మా అయ్య ఒక్కనాడూ సెప్పినాడుగాడు. మంచోళ్ళకే బగమంతుడు ఎన్నో అట్టుకట్టాలు పెడతాడంట. మాయదారి జబ్బు మంతిరి గోరికే రావాల్నా? ఏటో ఈ పెపంచకం??"

జారవేసిన తలుపును కొద్దిగా త్రోసింది. చిన్నగా చప్పుడైంది. ఎందుకో మల్లిక కాళ్ళు వణికాయి. ముందుకు పడాల్సిన అడుగు వెనక్కి పడింది. "ఆర్ని డక్కుండా లోనికెళ్ళచ్చో, ఎల్లకూడదో! కోంపడతారేమో?" అంటూ పైకి చూచింది. అధాట్టుగా చూచిందేమో, కెవ్వున అరవబోయి, నోరు పెగలక, ఓ చేత్తో గంపను గట్టిగా పట్టుకుని, మరో చేత్తో కళ్ళు మూసుకుంది.

గది ప్రవేశ ద్వారంపైన పులి చర్మం ఒకటి అమర్చబడి ఉంది. ఎర్రగా నోరుతెరచి, కోరలు సాచి, క్రౌర్యాన్ని సూచించే కళ్ళతో ఆ పులి మల్లిక వంకే గుర్రుగా చూస్తోంది. ఆ పులిని చూచే మల్లిక, భయంతో గజగజలాడిపోతోంది. రెండు, మూడు క్షణాలు అతి భయంకరంగా గడిచాయి. మల్లిక కాస్త నిభాయించుకుని, మూసుకున్న చేతి వ్రేళ్ళ సందుల్లోంచి ఆ పులి వంక చూడసాగింది.

"ఓలమ్మో! ఇది నా వంకే సూత్తుండాది గాని, నిజం పులి కాదు. సెరమంపులి. ఉట్టి పులి. పేనాలు లేవు. సచ్చిపోయిన పులిని ఈడబెట్టింద్రు. భయంతో సచ్చిపోనానుగందా నిజం పులని. అమ్మయ్య! ఇది

నన్నేం సెయ్యదు!" అంటూ "వ్వెవ్వెవ్వె" అని ఎక్కిరించి, ఒక్కడుగు ముందుకేసి, "అయ్యగోరూ! అయ్యగోరూ!" నెమ్మదిగా పిలిచింది మల్లిక. సమాధానం లేదు. ఇంకొంచెం గట్టిగా పిలిచింది తలుపులు తోస్తూ.

"ఎవరూ?" ఆ కంఠం మత్తుగా మూలిగింది.

"నానేనండి. మల్లికని. మా అయ్యంపిందు!" నెమ్మదిగా గొణిగింది.

"ఎవరు? ఎవరది? ఎవరంటే మాట్లాడరేం??" గుహలో నిద్రిస్తున్న పులి గురకలా గరగరలాడిందా కంఠస్వరం.

ఈసారి ధైర్యం చేసి, ఇంకొంచెం తలుపుముందుకు త్రోసి, లోనికడుగు పెట్టింది మల్లిక. అత్తరు వాసన గుప్పుమంది. ఆ వాసనతో పాటు మరేదో వాసన, వెగటు పుట్టే వాసన కలగాపులగంగా మల్లిక నాసికాపుటాలకు చేరింది. ఒక్క క్షణం ఉక్కిరిబిక్కిరైంది మల్లిక తడబడుతూ.

"నానే బాబూ! మల్లికని! పూల్దండ ఆడ్డరిచ్చినారంట గందా! కట్టి ఒట్టుకొత్తున్నాను. మా అయ్యం పిందు మీకిచ్చిరమ్మని!" అంది కాస్త తేరుకుంటూ.

ఏదో అలికిడైనట్లుగా పులి మేల్కొంది.

"మల్లిక... మల్లిక... నీ పేరు మల్లికా! చాలా బాగుంది పేరు. నువ్వు ఈశ్వరయ్య కూతురివా?? మీ అయ్య నాకెప్పుడూ చెప్పలేదే నీలాంటి అందమైన

కూతురున్నట్లు, రా! లోపలికిరా!!'' పులి నవ్వింది. కోరలు కనబడలేదుగాని, గారపట్టిన పళ్ళు దర్శన మిచ్చాయి. చచ్చేంత సిగ్గు పడుతూ, మెలికలు తిరిగి పోతూ లోనికడుగుపెట్టింది మల్లిక.

''ఏమిటే మల్లికా! అట్లా సిగ్గుపడిపోతున్నావు? మీ అయ్య, నువ్వు నాకు బాగా కావాల్సిన వాళ్ళు. నా దగ్గర సిగ్గుపడితే ఎట్లాగే??'' శరీరమంతా ఊగిపోతూ పులి పొగిలిపొగిలి నవ్వుతోంది. కాదు గాండ్రిస్తోంది భయం కరంగా.

''పూల్దండ ఏడెట్టమన్నారు బాబు గోరూ??''

''అదిగో— ఆ బీరువా ప్రక్కన పెట్టు!!'' పులి కళ్ళు నిషాగా చూస్తున్నాయి.

మల్లిక సిగ్గుతో, వయ్యారంగా, మెత్తగా నడిచి, చంక నుండి బుట్ట దించి బీరువా ప్రక్కనే ఉంచింది. బుట్ట దించడంలో మల్లిక పైట జారి, నేల మీద జీరాడుతోంది. ప్రక్కనే ఉన్న నిలువుటద్దంలోంచి మల్లిక స్పష్టంగా కనబడుతోంది. పులి కళ్ళు విచిత్రంగా మెరిశాయి. బలిసిన లేడిని చూచిన పులిలా కాలు దువ్వుతోంది ఆకలిగా. పైట సవరించుకుని పులి ముందు కొచ్చింది వినయంగా. ఏదో మధుర స్వప్నం చెదిరినట్లుగా తత్తరపడింది పులి. గుండెల నుండి వాడి, వేడి నిట్టూర్పు బయటికొచ్చింది పులికి.

''మల్లికా!''

''ఏటి బాబుగోరూ?''

''ఆ సీసాలోంచి కాస్త మందును గ్లాసులో పోసి స్తావూ?'' విస్కీ సీసాల వైపు చూపించిందా పులి. దాహంతో పిడచకట్టుకుపోయినట్లుగా, నాలుకతో పెద వుల్ని తడుపుకుంటుంది పులి మత్తుగా మూల్గుతూ.

మల్లిక మేజా వైపు నడచి, సీసా నుండి ద్రవాన్ని గ్లాసులోకి ఒంపుతోంది. మల్లిక నిజంగా మల్లికే. మల్లిక సొగసు మల్లెపువ్వంత స్వచ్ఛమైనది. మల్లిక మనసు మల్లె పువ్వంత నిర్మలమైనది. మల్లిక యవ్వనం అరవిచ్చిన మల్లె మొగ్గలా గుబాళిస్తోంది. కుళ్ళు— కల్మషం; పాపం—పుణ్యం; అశుభం—శుభం తెలీని మల్లిక గ్లాసులో ద్రవాన్ని నింపి పులికి అందించింది. పులి ఆత్రంగా అందుకుంది.

''నాకు తెలీకడుగుతుండాను. బాబుగోరూ! ఏమీ అనుకోమాకండేం?? మీకేదైనా సుత్తీసేసిందా?? ఈ మందులన్నీ మీకేనా బాబుగోరూ??''

అప్పటికే మల్లిక అందించిన గ్లాసులోని 'మత్తు' పులి శరీరాన్ని ఆవహిస్తోంది. పులి కళ్ళు ఎర్రబడు తున్నాయి.

''అవును మల్లికా సుస్తీయే! చాలా పెద్ద సుస్తీ! ఎవరికీ చెప్పలేని సుస్తీ... ఏమిటో తెలుసా! మ... ద... న...తా...పం...!!'' పులి నీలిగింది.

''ఓరి బాబోయ్!! గుండె జబ్బు కన్నా పెద్ద సుత్తీనా బాబుగోరూ??''

''వి...ర..హ..వ్య...ధ... కూడా దీనికి తోడు!!'' పులి ముక్కింది.

''అదేటి బాబుగోరూ? మా అయ్యకున్న రత్త పోటునాంటిదా బాబుగోరూ??''

''అవును ర..క్త..పో..టే!! ఇంకొంచెం మందు పొయ్యవే మల్లికా!!'' గుటకలు మింగుతోంది పులి. సీసాలోంచి, గ్లాసులోకి ద్రవాన్ని ఒంపుతున్న మల్లిక పచ్చటి చేతుల్ని, పున్నమి బింబం లాంటి ముఖాన్ని, మిలమిల మెరిసే కాటుక కళ్ళను— నెత్తుటి జీరలు పడ్డ కళ్ళతో ఆమె తొలి యవ్వనపు అందాల వైపు నిగిడి చూస్తోంది పులి.

''బాబుగోరూ! ఇంత పెద్ద పూల్దండని ఎవరికైనా ఏత్తన్నారా? మా అయ్య సెప్పిండుగందా!! రేపు ఆగట్టు పదేనంటగందా! సొతంతరం వచ్చిన రోజంట. మంత్రిగోరు ఈ పెద్ద పూల్దండను గాంధీగోరి మెడలో ఏత్తారే పిచ్చిముఖమా' అన్నాడు. గాంధీగోరు మనకు సొరాజ్జెం రప్పించినాడంటగందా! ఈ పూల్దండను గాంధీగారి మెడలో యేత్తారా బాబూ! ఆడకి నేను రావచ్చా! నాను చూడచ్చా!! బాబుగోరూ!!''

పులి నవ్వింది అదిరేలా - భూమి దద్దరిల్లేలా!! పులి నవ్వుతోంది వంకరగా టింకరగా!! పులి ఇంకా నవ్వు తోంది బ్రిటీషు వాడి కర్కశ, నిరంకుశ పాలనలా!!!

''గాం ధీ మహా త్ముడు—జాతిపిత! నేనూ గాంధీనే? నేనే కాదు గాంధీ టోపీ పెట్టుకున్న ప్రతి వాడు గాంధీనే!! ఖద్దరు ధరించిన ప్రతివాడు గాంధీనే!! మరయితే ఈ పూలదండను ఏ గాంధీకి వెయ్యాలి. ఆశయాలే గాని ఆచరణలేని, ఇంటికొక గాంధీ ఉన్న ఈ దేశంలో, ఆవేశమే గాని, ఆలోచనలేని, ఇంటికొక గాడ్సే కూడా ఉన్నాడు. గాంధీకి—గాడ్సేకి తేడా తెలిని ప్రబుద్ధులు రాజ్యమేలుతున్న ఈ దేశంలో ప్రతి ఒక్కడూ గాంధీయే? ప్రతి ఒక్కడు మహాత్ముడే?? మరలాంటప్పుడు ఇందరు గాంధీలున్నప్పుడు, ఈ పూలదండను అసలైన గాంధీకి వెయ్యటంలో అర్థం లేదు. పైగా గాంధీని అవమానం చేసినట్లవుతుంది. అందుకనే ఈ దండను ఎవ్వరికీ వెయ్యను!!''

''ఏటో బాబుగోరూ! నాకేటీ అరదం కాలేదు. ఈ పూల్దండ ఓరికీ వెయ్యనపుడు ఇదెందుకు బాబు గోరూ!!''

మందు మెల్లమెల్లగా, మత్తుగా, నిషాగా, ఖుషీగా పులి శరీరంలోకి దిగుతోంది వెచ్చ, వెచ్చగా! త్రేన్పులు కూడా వస్తున్నాయి అప్పుడప్పుడూ. శరీరం జోగు తోంది. రక్తం మరుగుతోంది. కోర్కెలు రెక్కలు విప్పు కుంటున్నాయి. అందం కవ్విస్తోంది తియ్యగా!!

''ఏయ్! మల్లికా! నీకో రహస్యం చెబుతాను. ష్! ఎవరైనా వింటారు. దగ్గరగా రా! ఎవరికీ చెప్పకు! పరువు పోద్ది! గాంధీగారు కోప్పడతారు. ఈ పూ..ల.. దం..డ నాకే!! వెయ్యడానిక్కాదు—వేయించుకోడా నికి!!''

''అయ్యయ్యో! మీకా? మీరేయించుకుంటారా? మరి మా అయ్య అట్టాసెప్పాడేంటి? నానూ అట్టాగే అనుకున్నాను. ఈ పూల్దండను గాంధీగోరికే ఏత్తా రని!!'' నోరు తెరిచింది మల్లిక అమాయకంగా!!


''నేనూ.... గాంధీనే!!''

''అది కాదు బాబుగోరూ!! రేపటేల మీకు పెజలంతా బోలెడు పూల్దండలు ఏత్తారుగందా! మళ్ళీ ఇదెందుకంట??'' మల్లిక బ్రహ్మ సందేహం.

''ఓసి పిచ్చిముఖమా! ఆళ్ళేసే దండలు చిన్న చిన్నవి. వాసన లేనివి. కాగితం పూలవి. అభిమానంతో కాదు స్వార్థంతో వేస్తారు. ప్రేమతో కాదు దేశాన్ని దోచుకోవడానికి లైసెన్సు ఇప్పించమని లంచంగా వేస్తారు. ఈ రోజుల్లో ఎవరు, ఎంత పెద్ద దండ వేస్తే ఆ ప్రజలంత మంచివారు. అంత పెద్ద దండ వేయించుకున్న వాడికది—అంత పెద్ద గొప్ప సన్మానం జరిగినట్టు. అంతెక్కువ గౌరవం ఉన్నట్లు. ప్రజలకి వాడి మీద అంతెక్కువ విశ్వాసం ఉన్నట్టు. అందుకే అంత పెద్ద పూలదండను వేయించుకుంటున్నాను. నేనే కాదు అందరూ అంతే!!''

''అంత పెద్ద ఇసవాసం ఉన్నప్పుడు పెజలే అంత పెద్ద దండెయ్యచ్చుగందా!!''

''అసలు విశ్వాసం ఉంటేగదా వెయ్యటానికి! కుక్కకున్న విశ్వాసం కూడా మాకు లేదు గదా! అందుకే ప్రెజలు వెయ్యరు. అదిగాక పోయినా మనది ఏ దేశం! బీద భారతదేశం. నూటికి తొంభై శాతం మందికి ఈ దేశంలో తిండి లేదు. ఇల్లు లేదు. కట్ట డానికి గోచీ తప్ప ఇంకేం లేదు. పాపం ఈ బీద ప్రజలే గదా మాలాంటోళ్ళ ఉపన్యాసం వింటానికొస్తారు. వాళ్ళేంవేస్తారు ఇంత పెద్ద పూలదండని. అందుకు మనకు మనమే వేసుకోవాలి! రాజకీయం గదా!అదంతే! ష్! గోడలకు చెవులుంటాయి. తలుపులకు కళ్ళుం టాయి. చనిపోయిన గాంధీగారికి ఆత్మ శాంతుండదు.



తలుపులేసెయ్! నీకుతెలీని "విషయాలె"న్నోచెబుతా! స్వర్గం ఎట్టాగుంటదో మాపిస్తా!!"

"శానా పొద్దుపోయింది! ఇంటికెల్లి పోవాలి! మా అయ్య నాకోసం ఎదురు సూత్తుంటాడు. నావెల్లి పోతాను బాబుగోరూ!!

"అది కాదు. మల్లికా!!" లేవబోయింది పులి ఆదుర్దాగా. తూలిపడింది. పడిపోతాడేమోనని, మల్లిక చటుక్కున పులిని పట్టుకుంది. ఆ స్పర్శకు పులినరాలు జివ్వుమన్నాయి. షేయి వోల్టుల విద్యుత్తు పులి శరీరంలో దావానలంలా ప్రజ్వలించింది. మనసు అదుపు తప్పింది. వేడి గగ్గోలు పెట్టింది.


మాస్తోంది పులి మాస్తోంది వెచ్చగా
లేచింది పులి లేచింది కసిగా!!
దూకింది పులి దూకింది ఆకలిగా!!!

* * * * * * * *

"నా ప్రియ ప్రజలారా! దేశాభ్యుదయ నేతలారా!! ఆడది కాలేజీకి వెళ్తే తిరిగొస్తుందో, లేదోనన్న 'భయం'! ఆడది ఉద్యోగానికెళ్తే తిరిగొస్తుందో, లేదోనన్న 'భయం'! ఆడది బజారుకెళ్తే తిరిగొస్తుందో, లేదోనన్న 'భయం'! భయం- భయం భయం! ఇలా ఆడది గుమ్మం దాటితే నూరేళ్ళు నిండిపోతున్నాయి. ఆడదాని మానానికి-ప్రాణానికి రక్షణ, భద్రత లేకుండా పోతోంది."

"ఆడదాన్ని ఒక ఆస్తిగా, ఒక వస్తువుగా, ఒక ఆట బొమ్మలా, మగవాడి చేతిలో కీలు బొమ్మలా తయారవుతోంది. ఇది ఆడది చేసుకున్న పాపమా? లేక ఆమె పాలిట శాపమా?? ఇదంతా మగజాతి అహంకారమో! పశుత్వమో తెలవటం లేదు. సృష్టికి మూలకారణమయిన స్త్రీ తర, తరాలుగా, ఎన్నో విధాలుగా అణగద్రొక్కబడుతోంది. దేశ వ్యవస్థకిది గొడ్డలి పెట్టు. ఈ వ్యవస్థ ఇలా కొన్నాళ్ళు కొనసాగితే ప్రళయం రాక తప్పదు. దేశం వినాశం కాక తప్పదు. స్త్రీ జాతి ఔన్నత్యం మంట గలిసిపోతూ, ప్రపంచ చరిత్ర పుటలు పాపపంకిలమై పోతున్నాయి. దిన, దినమూ క్రుంగి పోతున్న, కుళ్ళి పోతున్న ఈ మన వ్యవస్థను తిరిగి మనమే పునరుద్ధరించుకోవాలి. ఈ విషయంలో ప్రజలైన మీరు, మాకు అంటే ప్రభుత్వానికి సహకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఏ వ్యవస్థయినా, ఏ ప్రభుత్వమైనా, ఏ రాజ్యాంగమయినా ముందుకు నడవాలంటే, వెలుగును మాడాలంటే, ప్రజలే పూనుకోవాలి. ప్రజలే సహకరించాలి. ప్రజలే ముందుకు నడపాలి".

"మీ సహాయ, సహకారాలున్నంతవరకూ, మీ ఆదరాభిమానాలున్నంత వరకూ, మా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకూ, మీ అభిమానాన్ని నోచుకున్న నేను స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ జనవిమోచనోద్యమానికి నడుం కడతానని, కంకణాన్ని ధరిస్తానని, నా శాయశక్తులా అవిరళ కృషి సల్పుతానని ప్రజలైన మీ అందరి ముందు మరియు కఠోర దండి సత్యాగ్రహి, విదేశీ వస్త్ర బహిష్కృతాభిలాషి, సబర్మతీ ఆశ్రమ సంస్థాపకుడు, బ్రిటిష్ ముష్కర కబంధహస్త బంధ




విముక్తి చేయసమకట్టి, స్వరాజ్యాన్ని సాధించిన, స్వాతంత్ర్య సమరయోధుడు, నిరంతర సత్యాన్వేషి, సత్య దురంధరుడు, జాతి పిత, మహాత్ముడు అయిన పూజ్య బాపూజీ మీద ప్రమాణం చేసి, నా మాటం నిలబెట్టుకుంటానని ఈ సభాముఖంగా ఉద్ఘాటిస్తున్నాను!"

ప్రజలలో ఉప్పొంగిన కోలాహలం. జయ, జయ ధ్వానాలు, హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. ఆ జన కంఠస్వరం విన్న వినాయకరావు ఆనందం పెల్లుబికింది. గుండెలు గర్వంగా ఉప్పొంగాయి. వినాయకరావు ముఖంలో ఈ దేశపు ఆడపడుచుల మానాల్ని కాపాడగలడన్న భరోసా కనిపించింది ప్రజలకి. అల్పసంఖ్యాకులయిన నాయకుల అల్ప సంతోషులైన, అధిక సంఖ్యాకుల జీవితాల మీద అధికారపు స్వారీకి బలయిపోతోందన్న నగ్నసత్యాన్ని గుర్తించలేని జనం, ఇంకా చప్పట్లు కొడుతున్నారలాగే!!

దూరంగా నుంచిని, ఇదంతా వింటున్న మల్లిక అవాక్కయి పోతోంది. నిశ్చేష్టితురాలయింది. విభ్రాంతురాలయింది.

ఇంకా, ఇంకా అనర్గళంగా, సుదీర్ఘంగా సాగుతోంది వినాయకరావు స్పీచ్ యమస్పీడ్‌గా! ప్రజలంతా చెవులు నిక్కబొడుచుకుంటున్నారు.

నిన్నటి రోజున నవనవలాడిన 'పూలదండ' ఇప్పుడు వెలవెలబోతోంది మల్లికలా!!

వినాయకరావు చెమటతో తడిసిన 'పూలదండ' కంటికీ, మంటికీ ఏకధారగా ఏడుస్తోంది మల్లికలా!!

'పూలదండ'లోని ఎర్రగులాబిల వంకే ఎర్రబడ్డ ముఖంతో మాస్తోంది మల్లిక!!

'పూలదండ'లోని కనకాంబరాలు, రక్తం మరుగుతున్న మల్లికకు 'ధైర్యం' చెబుతున్నాయి.

'పూలదండ'లోని మల్లెపువ్వులు, ఎగిసి పడుతున్న మల్లిక గుండెలలో శక్తిసౌరభాలు వెదజల్లుతున్నాయి.

'పూలదండ'లోని లిల్లియలు, బిగుసుకుంటున్న మల్లిక పిడికిళ్ళకు జేజేలు పలుకుతున్నాయి.

'పూలదండ'లోని దవనం ఉద్విగ్న అయిన మల్లిక కళ్ళ నుండి వెలువడే అగ్నిధారలకు భాష్యం చెబుతోంది.

మల్లిక ఉన్మత్తురాలయింది. మొలలో దోపుకున్న కొడవలిని ఛర్రున లాగి, ఆ జనం మధ్యగా దూసుకు వస్తోంది. ప్రజావాహిని వంధిమాగధ కైవారాలకు ఒళ్ళు మరచిన వినాయకరావు పట్టలేని ఆనందంతో తన మెడలోని 'పూలదండ'ను ప్రజల మీదకు విసిరాడు. ప్రజల్లో ఆరాటం-పోరాటం 'పూలదండ' కోసం. కొట్టుకు ఛస్తున్నారు జనం 'పూలదండ' కోసం! బలాబలాలు తేల్చుకుంటున్నారు జనం 'పూలదండ' కోసం!!

"త్రోళ్ళళ్ళు త్రొక్కిసలాట లాక్కోడాలు-పీక్కోడాలు" పూలదండ చివికి, చివికి, చితికి, చితికి, ముక్కలు, ముక్కలై ఆనవాలు తెలీకుండా పోయింది.

ఉపన్యాసాన్ని ముగించి, వేదికపై కూర్చున్న వినాయకరావు వేడుకగా, వింతగా, చిద్విలాసంగా మాస్తున్నాడు జనం వైపు. ఆ ప్రజాసంక్షోభమాన్ని ఆపుదామని, ఏదో చెప్పబోయిన వినాయకరావుకు అకస్మాత్తుగా కుడిచేయి, కుడి కాలు చెప్పలేనంత తిమ్మిరెక్కింది. గొంతు పెగలడం లేదు. పెదాలు కదులుతున్నా మాట మూగవోయింది. కొద్ది క్షణాల తర్వాత వినాయకరావు గిలగిలలాడసాగాడు. నాయకులంతా ఖంగారుపడ్డారు. పోలీసు వారు చిందులు తొక్కేస్తున్నారు. ప్రజల్లో కోలాహలం హాలాహలంగా మారింది. ప్రజలంతా విషాదసాగరంలో మునిగిపోయారు. అశ్రుకణాలు ధారలౌతున్నాయి. క్షణాల మీద 'అంబులెన్సు'వచ్చింది. ఇందాక పూలదండను మోసుకొచ్చిన ఆ నలుగురే 'వినాయకరావు'ను అంబులెన్సులోనికి చేర్చారు. అంబులెన్సు కదిలింది. జనసాగరం వెన్నంటింది. పది నిమిషాలలో గ్రౌండు గ్రౌండంతా నిర్మానుష్యమయి పోయింది.

భయంకర నిశ్శబ్దమావరించిన ఆ గ్రౌండులో అనంత జన సందోహం యొక్క పాదతాడనాలకు అశువులు కోల్పోయిన 'మల్లిక' నిర్జీవంగా పడిఉంది. ఆమె చుట్టూ, ఆమె స్వహస్తాలతో అల్లిన 'పూలదండ' తాలూకు పువ్వులు పూల రేకులు!! ఇంతలో ఎక్కడ్నుంచో, ఓ చిన్న గాలి తెర గ్రౌండులో ప్రవేశించి, రాలిపోయిన పూల అవశేషాలను మల్లిక శరీరంపై అభిషేకించింది. దూరంగా ఓ పక్షి హృదయ విదారకంగా, గుండెలు పగిలేలా అరుస్తోంది. బహుశా అది మల్లిక తండ్రి ఈశ్వరయ్యదేమో??

●